

రూట్‌మ్యాప్ సిద్ధం చేయండి: పీవో

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లకు సంబంధించి రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. శనివారం ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సెక్టోరియల్ రూట్ అధికారులతో మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లడానికి అనుకూలంగా ఉండేలా రూట్ మ్యాప్ రూపొందించాలని తెలిపారు. బస్సులు వెళ్లలేని కేంద్రాలకు ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. సిగ్నల్స్ లేని పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ సమాచారం తెలుసుకునేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- అభ్యర్థులకు టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం
- విజయవాడలో ముఖాముఖి

పార్వతీపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ అభ్యర్థులు, ముఖ్య నాయకులకు నిర్దేశించారు. విజయవాడలో శనివారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రజల్లోనే ఉండండి.. ఈ ఐదేళ్లలో వారు ఎదుర్కొన్న సమస్యలు, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు వివరించండి.. టీడీపీ ప్రభుత్వం వస్తే ఏ విధంగా పాలన ఉండబోతోందో తెలియజేయండి.. శ్రేణులందరినీ కలుపుకుని ముందుకు వెళ్లండి' అంటూ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన ఎన్నికల హామీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీలను వివరంగా చెప్పాలని సూచించారు. త్వరలోనే పూర్తిస్థాయి ఎన్నికల హామీలను కూటమి ప్రకటిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఏ విధంగా వెనక్కి వెళ్లిపోయిందని, అభివృద్ధి ఎలా కుంటుపడిందో ప్రజలకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు ఎలా పెరిగాయో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఎటువంటి అరాచకాలకు పాల్పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ సమావేశంలో సాలూరు, పార్వతీపురం, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు గుమ్మిడి సంధ్యారాణి, బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాపులో టీడీపీ జిల్లా అభ్యర్థులు


మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

ఈ సమస్య పట్టదా?




ఇది వీరఘట్టం మండలం నడుకూరు గ్రామం. అక్కడ విద్యుత్ తీగకు ఎందుకిలా రాయిని వేలాడ దీసి ఉంచారని అనుకుంటున్నారా? లేకుంటే ఆ విద్యుత్ స్తంభానికి ఉన్న రెండు తీగలు కలిసి షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. దీనిపై సంబంధిత అధికారులకు తెలియజేసినా స్పందించకపో వడంతో స్థానికులే తెగించి విద్యుత్ తీగలు కలవకుండా ఇలా చేశారు. ప్రస్తుతం ఈ విద్యుత్ వైరు అతుకులమ యంగా ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలి యని పరిస్థితి. దీంతో స్థానికులు భయాందోళన చెందు తున్నారు. ఇదిలా ఉండగా ఆ ప్రాంతంలో ఉన్న సుమారు 60 గృహాలకు నిత్యం విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. గ్రామంలో పంట పొలాల మోటార్ల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచే ఇళ్లకు కూడా కరెంట్ సరఫరా చేస్తుండడంతో తరచూ ఆ గృహాలకు లోఓల్టేజ్ సమస్య ఏర్పడుతోంది. ఈదురుగాలుల సమయంలో చెట్టుకొమ్మలు తెగి వైర్లపైన పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై ఉన్నతాధికా రులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ స్థులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ బాలాజీని వివరణ కోరగా.. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ లైన్ వేరు చేసి వేరొక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ గృహాలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందు లు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- వీరఘట్టం

బరితెగింపు

- జిల్లాలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వలంటీర్లు
- వైసీపీ నేతల అండతో దివ్యాంగులు, వృద్ధుల ఓట్లకు వల
- పోస్టల్ బ్యాలెట్ పేరిట వారితో దరఖాస్తులపై సంతకాలు
- ఎవరైనా ప్రశ్నిస్తే.. ఓట్లు కోసమంటూ బుకాయింపు
- అధికారులకు ఫిర్యాదులు.. తాజాగా ఇద్దరు సస్పెన్షన్



పార్వతీపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొందరు వలంటీర్లు బరితెగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అడ్డుగా ఉన్నా హద్దు మీరుతున్నారు. యథేచ్ఛగా వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా.. పోస్టల్ బ్యాలెట్ పేరిట దివ్యాంగులు, వృద్ధుల ఓట్లకు వల వేస్తున్నారు. సస్పెన్షన్‌కు గురవుతున్నా.. వెనక్కి తగ్గడం లేదు. తాజాగా పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన వలంటీర్లు జి.ప్రభాకర్, దేవాబత్తుల రవిని విధుల నుంచి తొలగించారు. ఈ వలంటీర్లు అదే గ్రామానికి చెందిన సంగం రెడ్డి వెంకటరమణ, గొడవ కృష్ణ అనే దివ్యాంగుల వద్దకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ కోసం వారితో దరఖాస్తులపై సంతకాలు చేయించుకున్నారు. ఇదంతా దేని కోసమని దివ్యాంగులు ప్రశ్నించగా ఓట్లు కోసమని తెలిపారు. అయితే దీనిపై ఇటీవల ఎంపీడీవో షేక్ మహమ్మద్ అకీబ్‌జావిద్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. క్షేత్రస్థాయిలో విచారణ చేసిన అనంతరం ఉన్నతాధికారులకు ఎంపీడీవో నివేదిక అందించారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హేమలత ఆదేశాల మేరకు ఆ ఇద్దరు వలంటీర్లను ఎంపీడీవో సస్పెండ్ చేశారు. ఇటీవల పాచిపెంట మండలం పాంచాళి గ్రామంలో రాజకీయ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్న 11 మంది వలంటీర్లను ఒకేసారి విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా పార్వతీపురం మండలంలో ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని స్థితిలో ఉండే దివ్యాంగులు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. అయితే దీనిని వైసీపీ నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వలంటీర్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఓటర్లుగా ఉన్న దివ్యాంగులు, వృద్ధుల వివరాలను సేకరిస్తున్నారు. వారితో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులపై సంతకాలు పెట్టించి అక్రమాలకు పాల్పడుతున్నారు. దివ్యాంగులు, వృద్ధుల నుంచి సంతకాలు సేకరించిన అనంతరం వారి బ్యాంకు ఖాతా వివరాలు కూడా స్వీకరిస్తున్నట్టు సమాచారం. ఇదే సమయంలో ఆ ఖాతాల ద్వారా తాయిలాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలుస్తోంది.

- జిల్లాలో కొన్నిచోట్ల వలంటీర్లు పల్లెలో నిరక్ష్యరాస్యులైన వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తులపై సంతకాలు పెట్టించుకుని.. అసలు విషయం వారికి చెప్పడం లేదు. ఇలా సంతకాలు పెట్టించుకున్న దరఖాస్తులను వైసీపీ నాయకులే తీసుకుని వృద్ధులు, దివ్యాంగుల తరఫున కార్యాలయాల్లో అందించున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో ప్రారంభమవడంపై వైసీపీ నేతల హస్తం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో పార్వతీపురం మండలంలోనే కాకుండా బలిజిపేట, సీతానగరం మండలాలతో పాటు పార్వతీపురం పట్టణంలో కూడా దివ్యాంగులు, వృద్ధుల ఓట్ల కోసం వైసీపీ నేతలు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు కూడా వలంటీర్లతో రహస్యంగా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిసింది. దివ్యాంగులు, వృద్ధుల ఓట్లను పోస్టల్ బ్యాలెట్ ద్వారా సంపాదించుకొని వైసీపీ తమకు అనుకూలంగా మార్చుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.
- దివ్యాంగులు, వృద్ధులు తమకు ఇష్టమైన వారికి ఓట్లు వేసుకోకుండా వైసీపీ నేతలు వలంటీర్ల ద్వారా అడ్డుతగలడం దారుణమనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆయా ఓట్లను వైసీపీకి అనుకూలంగా మార్చుకోవడం ఎంతవరకు సమంజసమని జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు.

ఎన్నికల సంఘానికి సవాల్..

ఒక విధంగా చెప్పాలంటే ఎన్నికల సంఘానికి వలంటీర్లు సవాల్ విసురుతున్నారు. ప్రభుత్వం ద్వారా గౌరవ వేతనం పొందుతున్న వలంటీర్లలో కొందరు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. ఇంటింటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా సీఎం జగన్‌ను గెలిపించాలని పిలుపునిస్తున్నారు. వైసీపీని గెలిపించకుంటే పథకాలన్నీ ఆగిపోతాయని లబ్ధిదారులను బెదిరిస్తున్నారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ పేరిట దివ్యాంగులు, వృద్ధులకు ఓటు వేసుకునే అవకాశం లేకుండా చేస్తున్నారు. పల్లెల్లో ప్రజల నిరక్ష్యరాస్యత, అమాయకత్వాన్ని వారికి అనుకూలంగా మలుచుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో వలంటీర్లు పాల్గొనరాదని పదేపదే ఎన్నికల సంఘం హెచ్చరిస్తున్నా వారు మారడం లేదు. ఇదే సమయంలో పలువురు వలంటీర్లను అధికారులు సస్పెన్షన్ చేస్తున్నా వారిలో మార్పు కనిపించడం లేదు.

నేటి నుంచి
లివిరిలో డోలోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి
- గోపీనాథ రాధారాణి ఆలయానికి పోటెత్తనున్న భక్తులు

భామిని: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో వంశధార నదీతీరాన వెలిసిన లివిరి గోపీనాథ రాధారాణి ఆలయం డోలోత్సవానికి ముస్తాబవుతోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పర్లాకిమిడి గజపతిరాజుల ఇష్టదైవమైన గోపీనాథ రాధారాణి ఆలయంలో సంప్రదాయం ప్రకారం విశేష పూజలు చేసేందుకు గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, మగా తోటలో కామదహనం కార్యక్రమం చేపట్టనున్నారు. మంగళవారం ఇక్కడ హోలీ పండగ జరిపి.. ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా వంశధార నదిలో శుద్ధి చేస్తారు. అదే రోజు రాధారాణి పాద దర్శనం కార్యక్రమం నిర్వహిస్తారు. మొత్తంగా తొమ్మిది రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు ఒడిశాలోని పర్లాకిమిడి తదితర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.


లివిరిలో పూజలందుకున్న గోపీనాథ రాధారాణి ఉత్సవ మూర్తులు

విధి నిర్వహణలో
అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

కురుపాం రూరల్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో ఉన్న మూలిగూడ పోలీసు చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో భారీ మొత్తంలో నగదు, ఇతరత్రా వస్తువులు, నాటు సారా, గంజాయి, నిషేధిత ఖైనీ, గుట్కా ప్యాకెట్లు రవాణా అవ్వకుండా చూడాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా.. తమకు తెలియజేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో పాలకొండ ఆర్డీవో వెంకటరమణ, తహసీల్దార్ శివశంకర్, ఆర్ఐ కరుణాకర్, ఎస్ఐ షన్ముఖరావు తదితరులు ఉన్నారు.


మూలిగూడ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్

నా భర్తను
సస్పెండ్ చేయడం దారుణం

- ఓటమి భయంతోనే కక్ష సాధింపు చర్యలు
- టీడీపీ కురుపాం అభ్యర్థి జగదీశ్వరి

పార్వతీపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ ఉపాధ్యాయుడైన తన భర్త సన్యాసినాయుడును సస్పెండ్ చేయడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని టీడీపీ కురుపాం అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం రాత్రి ఆమె విజయవాడ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ.. గుమ్మలక్ష్మీపురం భద్రగిరిలో తన భర్తకు కేటాయించిన క్వార్టర్‌లో ఉండడం అన్యాయమా? అని ప్రశ్నించారు. తన భర్త ఎటువంటి రాజకీయాలకు పాల్పడడం లేదని తెలిపారు. ఆయన ఉపాధ్యాయుడిగా మాత్రమే పనిచేస్తున్నారని చెప్పారు. 'నేను ఎమ్మెల్యేగా పోటీ చేస్తుండం వల్ల మా ఇంటికి కార్యకర్తలు, ప్రజలు వస్తుంటారు.. అంతమాత్రాన తన భర్త రాజకీయాలు చేస్తున్నారు' అని ఎలా అంటారని ఆమె ప్రశ్నించారు. ఇటువంటి వాటికి తాను భయపడేది లేదన్నారు. వైసీపీ ఓటమి భయంతోనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కొంతమంది వైసీపీ నాయకులు అవే క్వార్టర్స్‌లో రాజకీయాలు చేస్తున్నారని.. అవి కనిపించడం లేదా? అని ధ్వజమెత్తారు. ఏదేమైనా ఇటువంటి వాటికి జడిసేది లేదని, నిజమైన ఆదివాసీ బిడ్డగా తనను గిరిజనులు, గిరిజనేతర్లు ఎమ్మెల్యేగా గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాగా ప్రభుత్వం కేటాయించిన నివాస గృహాన్ని రాజకీయ కార్యకలాపాలకు వినియోగించడం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన అవుతుందని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


జ్వరాలు ప్రబలకుండా చర్యలు

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణపై శనివారం స్థానిక ఎన్జీవో భవనంలో ఆరోగ్య పర్యవేక్షకులు, సహాయకులకు రీ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సర్వేలైన్స్ చేపట్టాలని, మలేరియా, డెంగ్యూ లక్షణాలతో ఉన్న వారికి నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు జ్వరాలు వస్తే వెంటనే చికిత్స అందజేసి పర్యవేక్షణ చేయాలన్నారు. డ్రైడే కార్య క్రమాలు పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి టి.జగన్మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి రఘుకుమార్, ఏపీడీయాలజిస్ట్ శ్రీధర్, ఏఎంవో సూర్యనారాయణ, వీబీడీ కన్సల్టెంట్ రామచంద్రరావు, ఈవో నాగేంద్ర, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు క్షయ నివారణ దినోత్సవం

జిల్లాకేంద్రంలోని ఎన్‌జీవో హోం సమావేశ మందిరంలో ఆదివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో జగన్నాథరావు తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలకు వచ్చే వారిలో కనీసం 10 నుంచి 15 శాతం వరకు టీబీ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు క్షయ రోగులను పర్యవేక్షించి.. మందులు వేసుకుంటున్నారో లేదో గమనించాలని సూచించారు. ప్రతి రెండు నెలలకొకసారి కఫం పరీక్షకు పంపించాలన్నారు. మందులు వాడే రోగులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ కనిపించినా వెంటనే ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. కాగా జిల్లాలో 43 ఇజిగ్రేటెడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, ఏడు టీబీ యూనిట్లును ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 230 మందిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 16 క్షయరహిత పంచాయతీలను ఎంపిక చేశామని వెల్లడించారు. క్షయవ్యాధి మందులు తీసుకుంటున్న వారికి నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలకుగాను మొత్తంగా రూ.మూడు వేలు వారి ఖాతాల్లో జమవుతుందని స్పష్టం చేశారు. క్షయ బాధితులను దత్తత తీసుకున్న వ్యక్తులు అందిస్తున్న రూ.700తో పౌష్టకాహారం కిట్లు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా క్షయ నివారణాధికారి నారాయణరావు, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, వైద్యులు, వైద్య సిబ్బంది, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

- ఓటర్లకు ఇబ్బందులు ఉండకూడదు
- కలెక్టర్ నాగలక్ష్మి



ఎస్.కోట: మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

శృంగవరపుకోట, మార్చి 23: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని, ఓటర్లకు ఎలాంటి ఉండకూడదని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. శనివారం మండల పరి షత్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, తదితర శాఖల అధికా రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులతో పాటు దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. నడవలేని స్థితిలో ఉన్న వారు మాత్రమే దీన్ని వినియోగించుకోవాలన్నారు. ఇలాంటి వారికి సహాయకులుగా 18 ఏళ్లలోపు ఉన్న వారిని మాత్రమే నియమించాలన్నారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల శిబిరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చిన సమావేశంలో వారు మాట్లాడారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై నిఘా పెట్టాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు సెలవులు పెట్టరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీటీ సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

బాడంగి: మండలంలోని బొత్సవానివలస, ఆనవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్వో రాజారావు శనివారం పరిశీలించారు. అల్లువానివలసలో ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంసీసీ లీడర్ జి.ఆంజనేయులు, ఈవోఆర్డీ సూర్యనారాణ, పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు కోరారు. బాడంగి మండలంలోని కోడూరు, పిన్నవలస, బాడంగి గ్రామాల్లో శనివారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో వివాదాలు, తగవులు సృష్టించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జయంతి పాల్గొన్నారు.



బాడంగిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కచ్చితంగా ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని స్థాయిల్లోని అధికారులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎ.సాయిశ్రీ ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మోడల్ కోడ్‌ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ), స్టాటిక్స్ సర్వేలెన్స్ , ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, పక్షపాతం లేకుండా వ్యవహరించాలని ఆర్డీవో అన్నారు. రాజకీయపార్టీలు కోడ్ ఉల్లంఘించకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్, సీఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

వేపాడ: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు మండల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో నిర్మల, తహసీల్దార్ కె.సత్యం అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిం



మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

రాజాం రూరల్: ఎన్నికల దృష్ట్యా అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి సిబ్బందిని ఆదేశించారు. ట్రైనీ డీఎస్పీ మహేంద్రతో కలిసి రాజాం రూరల్ సీఐ కార్యాలయంలో రేగిడి, వంగర, సంతకవిటి ఎస్ఐలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో గత ఎన్నికల సమయంలో ఏయే గ్రామల్లో సమస్యలు తలెత్తాయి, శాంతిభద్రతలకు భంగం కలిగించే సంఘటనలు ఎక్కడెక్కడ చోటుచేసుకున్నాయో పరిశీలించి అలాంటి గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజల్ని సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్, రేగిడి, వంగర ఎస్ఐలు శ్రీనివాసరావు, జనార్ధనరావు, షేక్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి

విజయనగరం క్రైం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. రాజస్థాన్‌కి చెందిన జితేంద్ర సింగ్, బింజోలం రెండు బ్యాగులతో శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా జిల్లా పరిషత్ కార్యాలయ సమీపంలో వన్‌టౌన్ ఎస్ఐ నవీన్ పడాల్, టాస్క్‌ఫోర్సు ఎస్ఐ సాగర్‌బాబు పట్టుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా 12 ప్యాకెట్లతో గంజాయి పట్టుబడింది. వీటి బరువు 18 కిలోలు ఉందని, రూ.లక్ష విలువ చేస్తుందని సీఐ తెలిపారు.

చోరీ కేసులో పురోగతి?

రామభద్రపురం: మండల కేంద్రంలో ఈ నెల 16న రాత్రి జరిగిన చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి ఓ ఇంట్లోకి చొరబడి మారణాయుధాలతో బెదిరించి మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఇది అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనిగా పోలీసులు అనుమానించారు. వారి అనుమానమే నిజమైంది. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు తెలిసింది. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సాలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుమలరావు ఆధ్వర్యంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి పక్కాగా ఆధారాలు సేకరించినట్టు సమాచారం. రామభద్రపురం మండల కేంద్రంలోని బొబ్బిలి రూటులో ఉన్న సీసీ కెమెరాల్లో దొంగల కదలికలు రికార్డయ్యాయి. కొద్దిరోజుల ముందు వారు ఈ ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్టుగా కూడా తెలుసుకున్నారు. ఇదే దొంగల ముఠా ఇటీవల విశాఖ జిల్లా పద్మనాభంలో కూడా చోరీ చేసినట్టు తెలిసింది. ఇక్కడ ఏ విధంగా అయితే మారణాయుధాలతో బాధితులను గాయపరిచారో అక్కడ కూడా అదే విధంగా చేసినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ కేసు వివరాలను త్వరలో పోలీసులు బయటపెట్టనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

42 మద్యం సీసాల స్వాధీనం

రేగిడి/రాజాం: రేగిడి మండలం లక్ష్మీపురం జంక్షన్‌లో శనివారం రాజాం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో లక్ష్మీపురం గ్రామానికి చెందిన బాలి కృష్ణారావు 42 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. కృష్ణారావును అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఎస్.చంద్రశేఖర్, ఎం.శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీవీజీ రాజు తదితరులు పాల్గొన్నారు. ● 28 మద్యం కేసుల్లో పట్టుబడిన 925 లీటర్ల సారాని, 45 లీటర్లు ఎన్‌డీపీఎల్‌ను, 291 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. సారా కేసులో పట్టుబడిన ఆటోలను వేలం వేసినట్లు చెప్పారు.

ప్రమాదాలకు నిలయంగా వావిలపాడు రోడ్డు

- క్రషర్ లారీ బోల్తా
- తప్పిన పెను ప్రమాదం

వేపాడ: మండలంలోని వావిలపాడు నుంచి కొత్తవలస- దేవరాపల్లి రోడ్డుకు వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారి వెడల్పు తక్కువగా ఉండడంతో భారీ లోడులతో వస్తున్న లారీలు అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. ఈ రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు లారీలు వచ్చే సమయంలో తప్పుకునే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా వావిలపాడు క్వారీ నుంచి కేడీ రోడ్డు వైపు వెళ్తున్న టిప్పర్ లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి గ్రామ శివార్లలో గల పంట పొలాల్లో బోల్తా పడింది. వెంటనే స్థానికులు స్పందించి... లారీలో ఉన్న వారిని ఆటోలపై ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం పెద్దదైనా అందరూ స్వల్ప గాయాలతో బయట పడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని వావిలపాడు గ్రామస్తులు కోరుతున్నారు.



పొలాల్లో బోల్తాపడిన టిప్పర్ లారీ

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ న్యాయాధికారి బాబు

రాజాం రూరల్: మహిళలకు తమకు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని మండల న్యాయ సేవాసంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాబు అన్నారు. పట్టణంలోని ఫ్లోరెన్స్ నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్త్రీల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో), తదితర చట్టాల గురించి వివరించారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణసాయితేజ మాట్లాడుతూ.. మహిళలకు అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు విజయకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి బాబు

అది ప్రభుత్వ భూమే

- సర్వేలో తేల్చిన అధికారులు

వేపాడ: వావిలపాడు జంక్షన్ సమీపంలో ఆక్రమణలకు గురైనది ప్రభుత్వ రస్తా భూమేనని రెవెన్యూ అధికారులు నిగ్గుతేల్చారు. కొత్తవలస-దేవరాపల్లి రహదారిలో వావిలపాడు జంక్షన్‌ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ రస్తా భూమిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థానిక వైసీపీ నాయకుడు ఈర్లి సన్యాసినాయుడు అండదండలతో ఆక్రమించడమే కాకుండా... అక్రమ నిర్మాణాలకు పూనుకున్నాడు. దీనిని గుర్తించిన గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సత్యం సర్వే చేసి నివేదిక అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు ఆర్ఐ రామలక్ష్మి, సర్వేయర్ అప్పలనాయుడు, గ్రామ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆక్రమిత భూమిని సర్వే చేశారు. సర్వే నెంబరు 49/1లో గల 16 సెంట్లు ప్రభుత్వ రస్తా భూమిగా గుర్తించారు. ఈ భూమిని ఎవరు ఆక్రమించినా... అక్రమ కట్టడాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు. ఈ సర్వేలో వీఆర్వోలు మిరియాల ఈశ్వరరావు, డెక్క ప్రసాద్, అప్పలరాం, తాతారావు, శ్రీను, సన్యాసినాయుడు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

అనుమతి లేకుండా ఎమ్మెల్యే కడుబండి ప్రచారం

- అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి

జామి: రామయ్యపాలెంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావుకు చేదు అనుభవం ఎదురైంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం ఎమ్మెల్యే కడుబండి ఎన్నికల ప్రచారం నిమిత్తం రామయ్యపాలెం వెళ్లారు. ఉపాధి వేతనదారుల వద్దకు వెళ్లి జగనన్న పథకాలు వివరించడంతో పాటు ఓటు వేయాలని కోరారు. అదే సమయంలో పంచాయతీ కార్యదర్శి నజ్మా అక్కడికి చేరుకున్నారు. 'సార్.. మీ ప్రచారానికి అనుమతి లేదు. దయచేసి వెళ్లిపోండి' అని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే ఐదు నిమిషాలు వాదించినా కార్యదర్శి వెనక్కి తగ్గలేదు. చేసేది లేక గ్రామంలో మృతుల కుటుంబాన్ని పరామర్శించి...అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ అంశంపై కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నికల నియామవళి పాటించకపోతే ఎఫ్ఐఆర్ నమోదవుతుందని ఎమ్మెల్యేకు వివరించామని తెలిపారు. అక్కడే ఉన్న కొందరు నాయకులు తనను దూషించారని వాపోయారు. ఈ విషయాన్ని ఎంపీడీవోకు తెలియజేసినట్లు చెప్పారు.

రాజాంలో కోడ్ కూయలేదా?



అర్బన్ హెల్త్ సెంటర్‌కు వైసీపీ రంగులు, సచివాలయం వద్ద జగన్ హోర్డింగ్

రాజాం: రాజాం నియోజకవర్గంలో ఇప్పటికీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రాలేదు. వారం రోజుల కిందట షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మరుక్షణం ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్తుంది. రాజాం నియోజకవర్గంలో ఇందుకు మినహాయింపులు ఇచ్చినట్టు స్థానిక అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎక్కడా శిలాఫలకాలపై ముసుగులు వేయలేదు. ఇప్పటికీ చాలా నిర్మాణాలు వైసీపీ రంగుల్లో దర్శనమిస్తున్నాయి. రాజాం ఆర్టీసీ బస్‌స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, చివరకు సెప్టిక్ ట్యాంకులను సైతం రంగులతో నింపేశారు. అటు మునిసిపాల్టీలోని అన్నివార్డుల్లో ఇళ్లకు సీఎం జగన్ స్టిక్కర్లు ఉంచారు. తక్షణం వాటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని విపక్షాలు కోరుతున్నాయి.

మరి వీటి సంగతేంటి?

జామి: ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెబుతు న్న అధికారులు... ప్రస్తుతం మండలంలో వందల సం ఖ్యలో గల ఇళ్లపై నవరత్నాల పేరుతో ఉన్న పలకలను తీస్తారా? రైతుల పొలాల్లో వేల సంఖ్యలో ఉన్న జగనన్న సర్వేరాళ్లు ఉంచుతారా? తొలగిస్తారా అంటూ చర్చ నడుస్తోంది. దీనిపై మండల సర్వేయర్ ఖాదర్ వివరణ కోరగా ఈ విషయం తమ జిల్లా సర్వేయర్, ఆర్‌డీవోల దృష్టిలో పెట్టామని... వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జామిలో ఓ పొలంలో ఉన్న జగనన్న భూరక్ష సర్వే రాళ్లు

ఖాసాపేట వలంటీర్ తొలగింపు

లక్కవరపుకోట: ఖాసాపేట సచివాలయం పరిధిలోని క్లష్టర్-6లో వలంటీర్ బొబ్బిలి శివ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించినందున విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఎంపీడీవో కె.రూపేష్ తెలిపారు. వలంటీర్‌కు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌లో రాజకీయ నాయకుల ఫొటోలు స్టేటస్‌లో ఉన్నందున ఆయనను తొలగించినట్లు తెలిపారు.

ప్రారంభోత్సవాలు ఆపండి

కొత్తపాలెం, జమ్మాదేవిపేట, దాసుల్లపాలెం పంచాయతీలలో ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన రామాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవాలు నిర్వహించరాదని ఎంపీడీవో కె.రూపేష్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండడం.. దేవదాయ శాఖ నిధులు ఉన్నందున ప్రారంభోత్సవాలు చేయరాదని పేర్కొన్నారు. ఈమేరకు సంబంధిత సచివాలయ అధికారులకు, దేవదాయ శాఖాధికారులకు తెలియజేశామని ఎంపీడీవో చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరంరింగురోడ్డు: నగరంలోని తోటపాలెం, ఒంటితడి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.హరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ట్యాంకు బండ్, తోటపాలెం, బ్యాంకు కాలనీ, శ్రీనివాస కళాశాల, మయూరి కూడలి, బాలాజీ నగర్, నరసింహనగర్, నాయుడు కాలనీ, కళ్యాణ్ నగర్, బీసీ కాలనీ, గోకపేట, ఆదిత్య నగర్, సూర్య నగర్, వివేకానంద కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. **బొబ్బిలి:** స్థానిక కోటి చెరువు దగ్గర ఉన్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆవాల అనంతరావు తెలిపారు. నాయుడుకాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీ బొమ్మ, వెలమవారివీధి, మున్సిపల్ పార్కు, టీటీడీ కళ్యాణమండపం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

గొట్లాంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు

విజయనగరం రూరల్: నగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో శనివారం గొట్లాం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని పలు వీధులను శుభ్రపరిచారు. కాలువల చుట్టూ బ్లీచింగ్ చల్లారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బొత్స ధర్మారావు, వలంటీర్లు పాల్గొన్నారు..

రేపు రేగిడిలో దత్తజ్ఞాన మహాసభ

రేగిడి: మండల కేంద్రం రేగిడి దత్తపీఠంలో సోమవారం ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ అధ్యక్షతన దత్తజ్ఞాన మహాసభ నిర్వహించనున్నట్లు స్థానిక దత్తపీఠ కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

2న చిదంబరేశ్వరుని ఆలయ ప్రారంభం

రేగిడి: మండలంలోని చిన్నపుర్లిలో చిన్మయిదేవి చిదంబరేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పూర్తయింది. గ్రామస్థుల విరాళాలతో పాటు దేవదాయశాఖ అందించిన సీజీఎఫ్ సాయం రూ.కోటి వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఏప్రిల్ 2న ఆలయం ప్రారంభించనున్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ శిబిరం

రేగిడి: రాజాం జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మునకలవలసలో రక్త గ్రూపు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. స్థానికులతో పాటు విద్యార్థులు 450 మంది వరకు హాజరై వారి బ్లడ్ గ్రూపును పరీక్షించుకున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు కొత్త సాయిప్రసాద్, ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 పీవోలు విశ్వనాథం, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజును కలిసిన బాబ్జీ

విజయనగరం దాసన్నపేట: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ శనివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి లోక్‌సత్తా జాతీయ పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో బాబ్జీ.. అశోక్‌ను కలిశారు. వీరివురూ జిల్లాలో రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ, మరోసారి జగన్‌ను గెలిపిస్తే సామాన్యులు బతకడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు.

క్షయ రహిత సమాజానికి కృషి: డీఎంహెచ్‌వో

విజయనగరం రింగు రోడ్డు, మార్చి 23: క్షయ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టరు భాస్కరరావు అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షయ అంటువ్యాధి అన్నారు. ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందన్నారు. మైక్రో బ్యాక్టీరియ ట్యూ బెర్క్యులసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా సోకుతుందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ప్రమాదం చూపుతుందన్నారు. జిల్లాలో గతేడాది 3,160 కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 608 కేసులు నమోదైనట్లు తెలిపారు. సకాలంలో క్షయకు చికిత్స పొందాలని, లేదంటే మందులకు కూడా లొంగని మొండి వ్యాధిగా మారుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ కేంద్రంలో సంప్రదించాలన్నారు. సకాలంలో చికిత్స చేసుకుంటే దీనిని పూర్తిగా నివారించవచ్చునన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిడ్స్, క్షయ, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

బొబ్బిలిలో అవగాహన ర్యాలీ

బొబ్బిలి: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బొబ్బిలి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌గేదెల శశిభూషణరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీ ఓడిపోతుంది-దేశం గెలుస్తుంది, టీబీ అంతం- మనందరి పంతం అంటూ టీబీ యూనిట్ సూపర్‌వైజరు ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో సిబ్బంది నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు , జ్వరం ఉంటే అది టీబీ కావచ్చని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రెడ్డి రవికుమార్, సౌజన్య, కృష్ణకుమార్, రాజకుమారి, ఎస్.కామేశ్వరరావు, రాజా రమేష్, ఆర్.స్వాతి, ఎం.సంధ్య, హెప్సిబా, డాక్టర్ రవి శంకర్, స్టాఫ్‌నర్సులు, నర్సులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది

అమరవీరులకు నివాళులు

బొబ్బిలి: స్వాతంత్ర్య సాధన కోసం బ్రిటీషు వారిపై పోరాటం సాగించిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో పీడీఎస్‌వో ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీవో మాజీ నేత రౌతు రామ్మూర్తి మాట్లాడుతూ.. బ్రిటీషుల నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాడి వీరమరణం పొందిన అమరవీరులకు నివాళులు అర్పించడం కనీస కర్తవ్యమని అన్నారు. యుక్తవయస్సులో అపారమైన దేశభక్తి చాటు కున్న త్యాగధనులు అని కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ, పీడీఎస్‌వో నాయకుడు రాకేశ్, పట్టణ కళాసీ సంఘం అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నీలబోసు నాగభూషణ్, కోట అప్పన్న, రవికుమార్, పా లూరి కృష్ణ, తులసీరామ్, చిన్నారావు, భాను పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న నాయకులు

గిరిజన రైతుల భూములు కాపాడండి

వేపాడ: కొండగంగుబూడి గ్రామ గిరిజన రైతుల భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా నాయకుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజనులు, యువకులతో శనివారం ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కేజీపూడి రెవెన్యూలో పట్టా ఒకరి చేతిలో ఉంటే భూమి ఇంకొకరి సాగులో ఉందని అన్నారు. వీటిని అన్యాక్రాంతం చేసేందుకు రియల్ వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను అసలైన గిరిజన రైతులకు అప్పగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నేడు జనసేనలో చేరికలు

మెంటాడ: మండలంలోని వైసీపీ కీలక నేత, ఇప్పవలస మాజీ ఎంపీటీసీ చింత కాశీనాయుడు ఆధ్వర్యంలో సుమారు 15 పంచాయతీల నుంచి దాదాపు వెయ్యి మంది ఆదివారం జనసేన పార్టీలో చేరనున్నారు. జనసేన జిల్లా నాయకురాలు పాలవలస యశస్వి, పొలిట్ బ్యూరో సభ్యురాలు పడాల అరుణ తదితరుల ఆధ్వర్యంలో వీరంతా జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పవన్ కల్యాణ్‌పై వీరాభిమానం

- జనసేన పార్టీ గుర్తు 'గ్లాసు' ఆకారంలో పెళ్లి కార్డు

బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన అడబాల నాగేశ్వరరావు (నాగు) మెగా ఫ్యామిలీకి వీరాభిమాని. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి నియోజక వర్గ నాయకునిగా కొనసాగుతున్నారు. ఆదివారం ఆయన కుమారుడు చరణ్‌తేజ్ వివాహం జరగనుంది. అయితే, జనసేన పార్టీ ఎన్నికల గుర్తు అయిన గ్లాసు ఆకారంలో పెళ్లికార్డులను ముద్రించి, బంధుమిత్రులందరికీ పంపిణీ చేశారు. పెళ్లి కార్డుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫొటోతో పాటు చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అర్జున్ తదితర మెగాఫ్యామిలీ ఫొటోలను కూడా ముద్రించాడు. మెగా అభిమానులు, జనసేన కార్యకర్తలు ఈ పెళ్లి కార్డును చూసి తెగ మురిసిపోతున్నారు.



జనసేన గుర్తు గ్లాసు ఆకారంలో పెళ్లి కార్డు

-బొబ్బిలి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

భోగాపురం: జాతీయ రహదారిపై లింగాలవలస సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై సీఐ ఎ.రవి కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంజేరు గ్రామానికి చెందిన రావాడ జగదీష్, ఇ.కనకరాజు అనే ఇద్దరు ద్విచక్ర వాహనంపై విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలో వస్తున్నారు. అదే రహదారిలో ముందుగా వెళ్తున్న కారును ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. జగదీష్‌కు బలమైన గాయాలు తగలడంతో పరిస్థితి విషమంగా ఉంది. వీరిద్దరు ప్రస్తుతం తగరపువలస ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జగదీష్ తల్లి సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో వారికి మినహాయింపు ఇవ్వాలి


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో దివ్యాంగ ఉపాధ్యాయులు, బాలింతలు, గర్భిణులు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను సిబ్బందిగా నియమించకుండా మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ జనరల్ సెక్రటరీ కె.విజయ్ కోరారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికలు నిర్వహణ సజావుగా సాగేలా తమ సంఘం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాం


అధ్యాపకులతో మాట్లాడుతున్న భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం: కళాశాలలో నూతన గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డా.పోల భాస్కరరావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కళాశాల అడ్మిషన్ల విషయంలో నిబంధనలు పాటించి, ఉన్నత విద్యాశాఖకు ఎప్పటికప్పుడు తగు సమాచారం అందించాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేనట్టు గుర్తించారు. అదనంగా గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి ఇస్తే నిధులు మంజూరు చేస్తామని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. ఆయన వెంట కళాశాల ఆర్జేడీ డా.శోభారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.శ్రీవరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ: ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ స్వర్ణలత ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించి, ఈనెల 28 నుంచి మే నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాల కోసం పాఠశాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. ● **సీతానగరం:** రాష్ట్రంలో 163 ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో జి.సూర్యదేముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి మే 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150, ఓబీసీ, ఇతరులకు రూ.200 నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలని సూచించారు. ● **దత్తిరాజేరు:** షికారుగంజి గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 2024-25 సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.ప్రసన్నలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. బీసీ, ఓసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 ఫీజుగా చెల్లించి దరఖాస్తు చేసుకోవాల న్నారు. మరింత సమాచారం కోసం 9177951662, 8008604619, 8639913299, 9573913140 నెంబర్లకు సంప్రదించాలని ఆమె కోరారు.

జనసేనలో చేరిక

గజపతినగరం: వైసీపీకి చెందిన 30మంది జనసేన పార్టీలో చేరారు. శనివారం గజపతినగరంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్ ఆధ్వర్యంలో వీరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బొండపల్లి మండల కోకన్వీనర్ జి.పైడిరాజు, కొత్తపాలెం పంచాయతీ జీడిపాలెం మాజీ సర్పంచ్ దాట్ల సింహాచలం, వైసీపీ వార్డు మెంబర్లు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రవికుమార్, మిడతాన, బొండపల్లి మండల కోకన్వీనర్ కోసురు అప్పన్నదొర, పైడిరాజు, బాలాజీ, భాను, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇప్పలవలసలో భారీగా చేరికలు

మెంటాడ: ఇప్పలవలస గ్రామం వేదికగా ఆదివారం భారీ సంఖ్యలో జనసేనలోకి చేరికలు జరగనున్నాయి. మాజీ ఎంపీటీసీ చింత కాశీనాయుడు ఆధ్వర్యంలో సుమారు 15 పంచాయతీల నుంచి దాదాపు వెయ్యి మంది జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు. పాలవలస యశస్వి, పడాల అరుణ హాజరు కానున్నారు.

మత్స్యకారుడి కుటుంబానికి భరోసా

పూసపాటిరేగ: చింతపల్లి గ్రామంలో ఇటీవల పడవ ప్రమాదంలో మృతి చెందిన బర్రి బ్రహ్మాజీ కుటుంబాన్ని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి శనివారం పరామర్శించారు. బ్రహ్మాజీ జనసేన కార్యకర్త కావడంతో, జనసేన కార్యకర్తలకు అందజేస్తున్న ఇన్సూరెన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జనపారి శివ, మండల నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని సేవలతో ముందుకు సాగండి

చీపురుపల్లి: చీపురుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు అందజేయాలని లయన్స్ 316ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.ఎ.గోపాలరావు సూచించారు. లయన్స్ క్లబ్‌ను ఆయన శనివారం సందర్శించారు. క్లబ్ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకాన్ని మరింత విస్తరింపజేయాలని ఆయన సూచించారు. వచ్చే జూన్ నెల లోగా క్లబ్‌లో మరో 20 మంది సభ్యుల్ని చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. 2022-23 సంవత్సరానికిగాను పూర్వపు అధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, కందుల పుండరీలకు ఆయన ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి పరిరక్షణపై దృష్టి సారించాలి

నెల్లిమర్ల: ప్రతిఒక్కరూ దృష్టి లోపాలను సరిదిద్దుకునేందుకు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి అన్నారు. ప్రపంచ ఆప్టోమెట్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఎక్కువ మంది మొబైల్ ఫోన్లు వాడుతున్నారని, అందువల్ల ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు విధిగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.పల్లవి, వైద్యుడు రణదేబ్ బెనర్జీ, విభాగ అధిపతులు శ్రావణి, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

బొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కాగా మెనూ అమలు చేయాలని ఎంపీడీవో ఎస్.హరిహరరావు సూచించారు. గిట్టుపల్లి గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. పిల్లల హాజరుపై అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఒంటిపూట మాత్రమే కేంద్రాలను తెరవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

చీపురుపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. నిబంధనల ప్రకారం ఈనెల 28 లోగా సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండడంతో, ఈ సమావేశం అనివార్యంగా నిర్వహించారు. ఎంపీడీవో డి.శ్వేత, ఇతర అధికారులు, ఎంపీటీసీలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

రేపటి నుంచి అమ్మవారి జాతరలు


భోగాపురంలో కనకదుర్గమ్మ


పోలిపల్లి పైడితల్లమ్మ

భోగాపురం: మండలంలోని భోగాపురం, పోలిపల్లి గ్రామాల్లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఆయా గ్రామ దేవతల జాతరలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భోగాపురంలో శ్రీకనకదుర్గమ్మ, పోలిపల్లి గ్రామంలో పోలిపల్లి పైడితల్లమ్మ జాతరలు ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ జాతరలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ ఎ.రవికుమార్ తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి

- ఎన్నికల నియమావళిపై అవగాహన
- సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు
- గ్రామాల్లో అధికారుల పర్యటన


వీరఘట్టం: మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్


గరుగుబిల్లి: వల్లరిగుడబలో పర్యటిస్తున్న ఎంపీడీవో, ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు


గజపతినగరం: డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మహరాజన్

వీరఘట్టం: ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శనివారం ఆయన పీవో, ఏపీవో మొదటి దశ ఎన్నికల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్నికల విధులు జాగ్రత్తగా పాటించాలన్నారు. ఈ శిక్షణలో మొత్తం 136 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు డి.గౌరునాయుడు, ఆనందరావు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు. ● ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో విధిగా ఎన్నికల నియమాలు పాటించాలని ఎంపీడీవో ఎంవీ సుబ్రహ్మణ్యం అన్నారు. చిదిమి గ్రామాన్ని ఎన్నికల బృందం సభ్యులు శనివారం పర్యటించారు. గ్రామ స్థాయి అధికారులు ప్రవర్తనా నియమావళిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలు ఉండకూడదన్నారు. ఎం.నాగభూషణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా అమలు చేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. వల్లరిగుడబ గ్రామంలో ఎఫ్ఎస్‌టీ టీంతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామ స్థాయి అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండవద్దన్నారు. ఈ పరిశీలనలో ఎఫ్ఎస్‌టీ అధికారులు బి.గౌరీశంకరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లకు అవగాహన

గజపతినగరం: ఎరువుల డీలర్లు ఎన్నికల నిబంధలను పాటించాలని గజపతినగరం సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.మహరాజన్ అన్నారు. మండలంలోని ఎరువుల డీలర్లకు శనివారం ఆయన గజపతినగరంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన కల్పించారు. ఎరువుల దుకాణాల వద్ద ప్రజాప్రతినిధుల పోస్టర్ కూడా ఉండకూడదని, పీఎంకేఎస్‌కేలకు సంబంధించిన పోస్టర్‌ను పూర్తిగా మూసివేయాలని తెలిపారు. రైతులకు ఎరువుల బస్తాలు సరఫరా చేసే ముందు వాటి మీద ఉన్న ప్రజాప్రతినిధుల బొమ్మలను మూసివేసి ఉంచాలన్నారు. సబ్ డివిజన్‌కు సంబంధించిన 4 మండలాల్లోని ఎరువుల డీలర్లు ఈ సూచనలను తప్పక పాటించాలని, లేని పక్షంలో తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

జీసీసీ ఉద్యోగులకు..

గుమ్మలక్ష్మీపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో జీసీసీ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని పార్వతీపురం జీసీసీ డివిజన్ మేనేజర్ మహేంద్ర సూచించారు. ఆయన శనివారం గుమ్మలక్ష్మీపురం బ్రాంచి కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. రాజకీయ నాయకుల బొమ్మలు కనిపించకుండా స్టిక్కర్లు వేసి రేషన్ పంపిణీ చేయాలనా సూచించారు. జీసీసీ డీఆర్ డిపోలపై వివిధ పార్టీల వాల్‌పోస్టర్లు, రాతలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గుమ్మలక్ష్మీపురం జీసీసీ మేనేజర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న మహేంద్ర

ఎన్నికల నిర్వహణలో అశ్రద్ధ తగదు


ఎన్నికల నిర్వహణపై డెమో ఇస్తున్న పాచిపెంట ఎంఈవో జోగారావు

సాలూరు రూరల్/పాచిపెంట: ఎన్నికల నిర్వహణలో అశ్రద్ధ ఉండకూడదని పాచిపెంట ఎంఈవో పల్లి జోగా రావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఎన్నికల నిర్వహణపై తొలిసారిగా పాచిపెంట మండలంలో పీవో, ఏపీవోలకు ఎంపీడీవో లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాచిపెం ట ఎంఈవో-1 పల్లి జోగారావు మాట్లాడారు. పోలింగ్ నిర్వహణను ఎన్నికల కమీషన్ సూచించిన నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సాలూరు, పాచిపెంట రెవిన్యూ అధికారులు, పాచిపెంట రెండవ ఎంఈవో పోతల సతీష్‌కుమార్, ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఈశ్వరరావు, నరేష్, సీఎంఆర్టీలు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఇప్పించండి


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జామి: మండలంలోని రైతులకు ధాన్యం డబ్బులు రూ.8 కోట్ల 40లక్షలు చెల్లించాల్సి ఉందని.. ప్రభుత్వం ఆ మొత్తాన్ని చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదని మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, టీడీపీ కార్యదర్శి రమణలు మండల వ్యవసాయాధికారి పి.కిరణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పెదబాబు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వానికి రైతులు ధాన్యం ఇస్తే దళారుల మాదిరిగా డబ్బులు ఇంకా ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి డబ్బులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమం లో రైతులు నాయుడుబాబు, అప్పారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగిడి: వన్నలి గ్రామంలో నిర్మించిన శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం నుంచి ప్రారంభమైంది. ఖండ్యాం పండితులు అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. తొలిరోజు వినాయకపూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, రక్షసూత్రధారణ, నవగ్రహ భద్ర మండల ఆరాధన, జలాధివాసం, సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ, సర్పంచ్ గార రమణ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జరిగిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన క్యాంపు కార్యాలయంలో బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరాటే అకాడమీ ఉపాధ్యక్షులు పి.అశ్విని, కోచ్ మహంతి శ్రీనివాస్, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి సంతోష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

పార్వతీపురంటౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ నేటి తరానికి నిజమైన హీరో అని ప్రముఖ కవి జి.గౌరునాయుడు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల వర్థంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ● భగత్‌సింగ్ వర్థంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని, సీపీఐ, ఏఐవైఎఫ్, రైతు సంఘ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాతబస్టాండ్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ● **సీతంపేట:** స్థానిక సీఐటీయూ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్థంతి నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతిరావు, సవర భాషా వలంటీర్ల ఉపాధ్యక్షుడు సవర డొంబురు.. భగత్‌సింగ్ చేసిన సేవలను గుర్తించుకున్నారు. పలువురు సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్థంతిని శనివారం సాలూరులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** భగత్‌సింగ్ వర్థంతి వేడుకలను శనివా రం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో పలు వామపక్ష సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు, సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు, న్యూడెమొక్రసీ నాయకుడు కాళ్ల అప్పలసూరి పాల్గొన్నారు.


పార్వతీపురం పట్టణంలో..


సీతంపేట: సీఐటీయూ కార్యాలయంలో..


సాలూరు రూరల్: నివాళులర్పిస్తున్న సీఐటీయూ, డీవైఎఫ్ఐ నేతలు


నెల్లిమర్ల: నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు

క్వారీలను నిలుపుదల చేయించాలి


డీటీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భోగాపురం: అక్రమంగా పరిమితికి మించి నిర్వహిస్తున్న క్వారీలను నిలుపుదల చేయించాలని రామచంద్రపేట, కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన నిర్వాసితులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉప తహసీల్దార్ శ్రీనివారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీల కారణంగా గ్రామంలో అధికంగా బూడిద ఎగిసిపడుతూ ఉందన్నారు. దీనికారణంగా తాగునీరు కలుషితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బాంబుల శబ్దానికి గోడలు పగులు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి ఉన్న క్వారీలను నిలుపుదల చేయించి, కొత్త క్వారీలకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని కోరారు. దీనిపై డీటీ మాట్లాడుతూ దీనిని పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోలా రామసూరి, ఎస్.చిన్నారావు, గరగయ్య, అప్పన్న పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించండి

బొండపల్లి: జాబ్‌కార్డు కలిగిఉండి వంద రోజులు పని దినాలు పూర్తికాని ప్రతి జాబ్‌కార్డుదారునికి తప్పనిసరిగా పని కల్పించాలని ఎంపీడీవో హరిహరరావు ఆదేశించారు. గిట్టుపల్లి గ్రామంలో ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున 6 గంటలలోపు పనులు ప్రారంభించి పదిన్నర గంటలలోపు ముగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు చేసేచోట టెంట్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ నెల నుంచి కొత్తగా పనులు ప్రారంభం కానున్నాయని, నిబంధనలు అన్నింటిని పక్కాగా అమలుచేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

డెంకాడ: పెదతాడివాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యుడు మల్లికార్జునరావు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. పిల్లల్లో గానీ పెద్దల్లో గానీ ఎటువంటి దంత సమస్యలు వచ్చినా నెల్లిమర్ల సీహెచ్‌సీలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీఏ నరసింగరావు, పాఠశాల కమిటీ చైర్మన్ బాలి శ్రీరాములనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సీతానగరం: గుచ్చిమి, సూరమ్మపేట గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ● **పార్వతీపురం రూరల్:** మండలంలోని వెంకంపేట తదితర పంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి ఆధ్వర్యంలో బాబు షూరిటీ కార్య క్రమాన్ని శనివారం నిర్వహించారు. గొట్టాపు వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్‌పై అవగాహన



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలో శనివారం ఎర్త్ అవర్‌ను పాటించారు. రాత్రి 8.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల మధ్య విద్యుత్ దీపాలను బంద్ చేశారు. ఏపీ ఎన్జీసీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు.

తనిఖీలు పక్కాగా ఉండాలి

● డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు సిబ్బందికి ఆదేశించారు. పట్టణంలోని పాలకొండ- శ్రీకాకుళం రోడ్డులో గాయత్రీదేవి ఆలయం వద్దగల చెక్‌పోస్టు వద్ద శనివారం ఆయన వాహన తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ఆధారాలు లేని విలువైన వస్తువులు, డబ్బు, మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహన యజమానులు తమ వద్ద వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ